రీచార్జ్ చేసుకో.. పవర్ వాడుకో

- ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సముదాయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు
- త్వరలో గృహాలకు ఏర్పాటు చేసేందుకు చర్యలు
- ముందస్తు చెల్లింపులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పేదలు



పట్టణంలోని ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్‌మీటర్లు

బద్వేలు అర్బన్ : వినియోగించే విద్యుత్‌కు ముందుగానే డబ్బులు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన స్మార్ట్ మీటర్ల విధానం పేదలకు, నిరక్షరాస్యులకు తలనొప్పిగా మారనుంది. ఇకపై విద్యుత్ వాడుకోవాలంటే ముందస్తుగానే రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సముదాయాల్లో 90 శాతం మేర స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారు. త్వరలోనే గృహాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. అయితే ముందస్తు చెల్లింపులపై గ్రామీణ ప్రాంత ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా .. ఏళ్ల తరబడి మీటర్ రీడర్లుగా పనిచేస్తున్న చిరుద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుంది.

ప్రారంభమైన స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ప్రక్రియ

బద్వేలు నియోజకవర్గంలో మూడు నెలల నుంచే స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ప్రక్రియ మొదలైంది. నియోజకవర్గంలో బద్వేలు, పోరుమామిళ్ల సబ్ డివిజన్ల పరిధిలోని ఏడు మండలాల్లో 92,981 గృహ సర్వీసులు, 7,773 కమర్షియల్ సర్వీసులు, 4,044 ప్రభుత్వ కార్యాలయాల సర్వీసులు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా 90 శాతం మేర కమర్షియల్, ప్రభుత్వ కార్యాలయాల సర్వీసులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. మరి కొద్ది రోజుల్లోనే గృహ సర్వీసులకు కూడా విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయనున్నారు.

పేదలపై భారం

ప్రస్తుతమున్న విద్యుత్ మీటర్ల ద్వారా మనం ఎంత మేర విద్యుత్ వినియోగించామో ఆ మేరకు ప్రతి నెల విద్యుత్ బిల్లులు అందజేస్తారు. బిల్లు అందిన 15 రోజుల వరకు అపరాధ రుసుము లేకుండా, మరో 15 రోజుల వరకు అపరాధ రుసుముతో బిల్లులు చెల్లించడానికి అవకాశం ఉండేది. అయితే ప్రస్తుతం నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్ల వలన ఆ వెసులుబాటు ఉండదు. తప్పనిసరిగా స్మార్ట్ మీటర్లకు ముందస్తుగానే రీఛార్జ్ చేసుకుని విద్యుత్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. ఒక వేళ రీఛార్జ్ అయిపోతే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఈ విధానం పేద ప్రజలపై తీవ్ర ప్రభావం చూపనుంది.

గ్రామీణ ప్రాంతాల్లో ఇబ్బందులు



స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు వలన గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తప్పవు. చాలా వరకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు స్మార్ట్‌ఫోన్లు లేకపోవడం, రీఛార్జ్ చేసుకునే విధానంపై అవగాహన లేకపోవడం వలన ఇబ్బందులు తలెత్తుతాయి. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతమున్న మీటర్లనే కొనసాగించాలి.

– పోకల మల్లేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, బద్వేలు మండలం

ఉద్యోగ భద్రత కల్పించాలి



దాదాపు 18 ఏళ్లుగా మీటర్ రీడర్‌గా పనిచేస్తున్నా. నూతన ప్రీపెయిడ్ విధానంలో స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేస్తుండటంతో ఉద్యోగం ఉంటుందో, పోతుందో అర్థం కావడం లేదు. ఒక వేళ తొలగించాల్సి వస్తే మాకు ప్రత్యామ్నాయంగా విద్యుత్ శాఖలో ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలి.

– రమేష్‌బాబు, మీటర్ రీడర్, బద్వేలు

క్లుప్తంగా

అల్లాడుపల్లెలో అన్నదానం



మొక్కలు నాటుతున్న ఆలయ నిర్వాహకులు

చాపాడు : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయం వద్ద శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి అన్నసత్రంలో స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, ఈఓ శ్రీనివాసులు సిబ్బందితో కలసి ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటారు. మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వారు తెలియజేశారు.

బస్ షెల్టర్ ఏర్పాటుకు పరిశీలన



బస్ షెల్టర్ ఏర్పాటుపై అధికారులతో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్

ప్రొద్దుటూరు : స్థానిక బీఎస్ హాల్ వద్ద వేసవి కాలం దృష్ట్యా నూతన బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆదేశించారు. సోమవారం బీవీఎస్ హాల్ వద్ద బస్ షెల్టర్ ఏర్పాటుపై అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఎస్.దస్తగిరి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగరాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న అతిథులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సూపర్‌బజార్ రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఆదరణ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సీవీఎస్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 20 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ హైమావతి, న్యాయవాది సీవీ జయలక్ష్మి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు చిప్పగిరి ప్రసాద్ మాట్లాడుతూ పేద మహిళలకు ఆదరణ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సీమంతాలు చేయడం అభినందనీయమన్నారు. సీమంతాలు చేసేందుకు సహకరించిన సీవీఎస్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు సీవీ సుబ్బారావుకు సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించి చీర, సారె అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కల్పన తదితరులు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న పంచాయితీ కార్యదర్శులు

రాజుపాళెం : పనిభారం తగ్గించాలని రాజుపాళెం మండల పంచాయితీ కార్యదర్శులు పేర్కొన్నారు. వారు రాజుపాళెంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం అనేక రకాల సర్వేలతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతో ఒత్తిడికి గురయి ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అనంతరం ఎంపీడీఓ రమణా రెడ్డికి 39 అంశాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తద్వార పని ఒత్తిడి తగ్గించాలని వారు ఎంపీడీఓను కోరారు.

చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేందుకు కృషి చేద్దాం

బద్వేలు అర్బన్ : రేపటి భావిభారత పౌరులైన చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేందుకు ప్రతిఒక్కరు కృషి చేద్దామని రాష్ట్రీయ బాల్‌స్వస్థ్య కార్యక్రమ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. గత నెల 10న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లలో నులిపురుగు నివారణ మందులు మింగిన విద్యార్థులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో రక్తహీనతకు, శారీరక ఎదుగుదల లేకపోవడానికి కడుపులో నులి పురుగులు ఉండటమే ప్రధాన కారణమని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు. నులిపురుగుల నివారణ కోసం మింగించే ఆల్బెండజోల్ మాత్రల వలన ఏవైనా దుష్పరిణామాలు ఉన్నాయా అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ నవీన్‌కుమార్, ప్రోగ్రామ్ మేనేజర్ రామ్మూర్తి, సోషల్ వర్కర్ సునీల్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు



మాట్లాడుతున్న సీబీఐటీ చైర్మన్ డా.వి.జయచంద్రారెడ్డి

చాపాడు : విద్యార్థులు ఎప్పటికప్పుడు తమలోని ప్రతిభను చాటుతూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సీబీఐటీ చైర్మన్ డా.వి.జయచంద్రారెడ్డి అన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)కాలేజీలో సోమవారం బిజ్-అరీనా 23-25 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబీఏ విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెకండియర్, థర్డ్ ఇయర్ విద్యార్థులు పాల్గొన్నారు. టెక్ మైండ్ అండ్ మారథాన్, హెచ్‌ఆర్ రౌండ్, పోస్టర్ ప్రజంటేషన్, ఫన్ యాక్టివిటీ షో యువర్ టాలెంట్ తదితర కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొన్నారు. వీటిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీబీఐటీ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులలో సృతజనాత్మకతను బయటికి తీసేందుకు కాలేజీ యాజమాన్యం ఎప్పటికప్పుడు ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి తమలోని ప్రతిభ చాటుకోవడమే కాక నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు చదువు అనంతరం స్వశక్తి, అంకితభావంతో ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీబీఐటీ డైరెక్టర్ అడ్మిన్ డా.జి.జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ డా.ఎస్.శృతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం డ్యాం ప్లంజ్ పూల్ వద్ద గొయ్యిని పూడ్చాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాపక్షం పార్టీ నాయకులు

ప్రొద్దుటూరు : శ్రీశైలం డ్యాం ప్లంజ్ పూల్ వద్ద ఏర్పడిన భారీ గొయ్యిని పూడ్చాలని సోమవారం డిప్యూటీ తహసీల్దార్ సాయినాథ్‌రెడ్డి ప్రజా పక్షంపార్టీ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రజా పక్షం పార్టీ అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ 1984–86లో శ్రీశైలం డ్యాం వద్ద 60 అడుగులు లోతుగా గొయ్యి పడిందని ఇంజినీరింగ్ అధికారులు చెప్పారన్నారు. 2000లో గోవాకు చెందిన జాతీయ సముద్ర పరిజ్ఞాన సంస్థ పరిశీలించి 75 అడుగు లోతుగా గొయ్యి ఏర్పడిందని, 2001లో ఆ గొయ్యి 90 అడుగులకు చేరిందని తెలిపారు. 2009లో భారీ వరదలు రావడంతో 120 మీటర్లు లోతు గొయ్యి ఏర్పడిందని జాతీయ సముద్ర విషయ పరిజ్ఞాన సంస్థ నిర్ధారించిందన్నారు. గొయ్యి 120 మీటర్ల లోతు, 270 మీటర్లు వెడల్పు, 400 మీటర్ల పొడవు ఉన్నట్లు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ, సెంట్రల్ సాయిల్ మెటీరియల్ రీసెర్చ్ విభాగం నిపుణులు నిర్ధారించారని తెలిపారు. దీంతో శ్రీశైలం డ్యాం భద్రత పెను ప్రమాదంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీశైలం ప్రాజెక్టు ప్లంజ్ పూల్ వద్ద ఏర్పడిన భారీ గొయ్యిని రాబోయే వర్షాకాలంలోపు పూడ్చి విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అంగన్వాడీలకు అందని జ్ఞానజ్యోతి శిక్షణ నిధులు

- విద్యాశాఖ తీరుపై విమర్శలు
- శిక్షణ ఖర్చులు ఎంఈఓలే పెట్టుకోండి అంటున్న జిల్లా అధికారులు



జ్ఞానజ్యోతి శిక్షణలో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు (ఫైల్)

కాశినాయన : విద్యాశాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు నిర్వహించారు. మండల కేంద్రమైన నరసాపురంలోని మోడల్ పాఠశాలలో ఫిబ్రవరి 19 నుంచి 26వ తేదీ వరకు శిక్షణ నిర్వహించారు. నూతన విద్యా విధానంలో భాగంగా 120 రోజుల శిక్షణలో భాగంగా అంగన్వాడీలకు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖకు అప్పచెప్పింది. మధ్యాహ్న భోజనంతో పాటు సాయంత్రం టీ, బిస్కెట్లు కూడా వారికి అందించాలి. అంగన్వాడీ కార్యకర్తకు రోజుకు రూ.50 చొప్పున ఆరు రోజులకు రూ.300లు చెల్లించాలి. అయితే పోరుమామిళ్ల మండలంలో శిక్షణ చివరి రోజున ప్రతి అంగన్వాడీ కార్యకర్తకు రూ.300లు చెల్లించారు. అయితే కాశినాయన మండలంలో చెల్లించలేదు. ఈ విషయమై ఎంఈఓ నిర్మలను వివరణ కోరగా శిక్షణకు సంబంధించి ప్రభుత్వం నిధులు మాకు మంజూరు చేయలేదని, ఆరు రోజులకు శిక్షణకు అయ్యే ఖర్చు, అంగన్వాడీలకు టీఏ బిల్లులు మీరే చెల్లించి బిల్లులు పంపండి అని జిల్లా అధికారులు తెలిపారన్నారు. ఇప్పటికే మేము వారి భోజనానికి చేతి నుండి డబ్బులు చెల్లించామని, అంగన్వాడీ కార్యకర్తలకు రూ.300 చెల్లించాలనే మాట వాస్తవమేనని, బిల్లులు ప్రభుత్వానికి అందజేశామని, నిధులు మంజూరైన వెంటనే అంగన్వాడీ కార్యకర్తలకు అందిస్తామని తెలిపారు.

మత్తుతో చిత్తు కావద్దు



మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలకు అలవాటుపడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ గోవిందరెడ్డి, ఫ్యాక్షన్ జోన్ సీఐ రామాంజనేయరెడ్డి సూచించారు. స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ఓ యువత మేలుకో కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల వినియోగం.. పర్యావసానం అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు. మత్తు పదార్థాల పట్ల అవగాహన కలిగి వాటికి దూరంగా ఉండి, భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. విద్యార్థులు కొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలను చేయాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.జయరామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ ఎదుగుదలకు అవసరమైన చదువు, ఆటల పట్ల శ్రద్ధ వహించి, మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కళాశాల డీన్ ప్రొఫెసర్ కేవీ రమణయ్య మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సమస్యలపై, మత్తు పదార్థాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పోలీసుల కళాజాగృతి బృందం సభ్యులు మత్తుపదార్థాలు – పర్యావసానం పాటలు, లఘు నాటిక ద్వారా వివరించారు. పోలీసుల కళాజాగృతి బృందం సభ్యులు నరసారామ్, ఉత్తమ్, మహేష్, సునీల్, శ్రీరామ్, ఉదయ్, మధు, కరుణాకర్, సుబ్రహ్మణ్యం, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్మీ నియామకాల్లో అగ్నివీర్‌కు ఉన్నత స్థానం



అగ్నివీర్ ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న ఆర్మీ రిక్రూటింగ్ అధికారులు

బద్వేలు అర్బన్ : ఆర్మీ నియామకాల్లో అగ్నివీర్‌కు ఉన్నతమైన స్థానం ఉందని, దానిని యువత సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు అసిస్టెంట్ ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీసర్ సుబేదార్ డి.ఆర్.పాండ పేర్కొన్నారు. అగ్నివీర్ నియామకాలపై సోమవారం స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌సీసీ కేడెట్లకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా దరఖాస్తు చేయు విధానం, ఎంపిక ప్రక్రియ, అర్హతలు, ఎంపికైన అభ్యర్థులకు ఇచ్చే శిక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. దేశానికి సేవ చేసే అదృష్టాన్ని ఎవరూ వదులుకోవద్దని, అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేశసేవలో భాగస్తులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఆర్మీ రిక్రూటింగ్ అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీసర్ హవీల్దార్ హెచ్.ఎన్.ఎస్.యాదవ్, కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, ఎన్‌సీసీ ఏఎన్‌ఓలు బాల ఓబులేసు, అధ్యాపకులు డాక్టర్ అశోక్, కబీర్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం



రికార్డులు పరిశీలిస్తున్న బ్రిగేడియర్, వెల్ఫేర్ అధికారి

పోరుమామిళ్ల : మాజీ సైనికుల సమస్యలను పరిష్కారానికి సమష్టిగా చర్చించుకొని కృషి చేద్దామని సైనిక్ వెల్ఫేర్ ఆంధ్రప్రదేశ్ బ్రిగేడియర్ వెంకటరెడ్డి, జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి అబ్దుల్ రజాక్ పేర్కొన్నారు. సోమవారం వారు పోరుమామిళ్లలోని మాజీ సైనికుల కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొని, మాజీ సైనికుల సాధక బాధలను అడిగి తెలుసుకొన్నారు. మాజీ సైనికుల కర్తవ్యాల గురించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మేజర్ కార్తీక్, మాజీ సైనికుల అసోసియేషన్ అధ్యక్షుడు కెప్టెన్ నవరం సుబ్బరాయుడు, జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు, కెప్టెన్ నారాయణ, సుబేదార్ వైవి సుబ్బారెడ్డి, బాలిరెడ్డి, చంద్రయ్య, హవల్దార్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాలు అమలు చేయకపోతే ప్రజాగ్రహం తప్పదు

బద్వేలు అర్బన్ : కూటమి నేతలు ఎన్నికల వాగ్దానాలు అమలు చేయకపోతే ప్రజాగ్రహం చవిచూడక తప్పదని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు ఎస్.చంద్రశేఖర్, చంద్రమోహన్‌రాజు పేర్కొన్నారు. సోమవారం వారి కార్యాలయంలో నిర్వహించిన ఏరియా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చాక నిధులు లేని కారణంగా పథకాలను అమలు చేయలేకపోతున్నామని చెప్పడం సిగ్గుచేటన్నారు. తక్షణమే ఎటువంటి ఆంక్షలు లేకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాలను అమలు చేసి ప్రజల పట్ల తమకున్న నిబద్ధతను, నిజాయితీని నిరూపించుకోవాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహం చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. పార్టీ జిల్లా నాయకులు జకరయ్య, నియోజకవర్గ నాయకులు రామరాజు, బాబు, విజయరావు, విద్యార్థి సంఘం నాయకులు అనిల్, శివరామ్, పట్టణ నాయకులు బాబు, చెన్నయ్య, జయపాల్, చంద్రపాల్ పాల్గొన్నారు.

నిబద్ధత, సౌకర్యవంతమైన సేవలే లక్ష్యం

మైదుకూరు : ఖాతాదారులకు నిబద్ధత, సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని బ్యాంక్ ఆఫ్ బరోడా తిరుపతి రీజనల్ ఏజీఎం అమర్నాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం మైదుకూరు – కడప వెళ్లే మార్గంలో ఏర్పాటైన బ్యాంకు బ్రాంచ్‌ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుపతి రీజియన్‌లో మైదుకూరు బ్రాంచ్ 60వదని పేర్కొన్నారు. మైదుకూరు ప్రాంతంలో 20 గ్రామాలకు తమ బ్రాంచ్ సేవలు అందిస్తుందని చెప్పారు. బ్యాంకు డిప్యూటీ రీజనల్ హెడ్ బి.ప్రసాద్, కడప బ్రాంచ్ మేనేజర్ కాంతారావు, మైదుకూరు బ్రాంచ్ మేనేజర్ జె.రాజు పాల్గొన్నారు.

హనుమంతరావు సాహితీ కృషి అభినందనీయం

బద్వేలు అర్బన్ : బద్వేలుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త గానుగపెంటహనుమంతరావు నిర్వారామ సాహితీ కృషి ఎంతో అభినందనీయమని పీఆర్ ఆర్‌డీ మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డినాగార్జునరెడ్డి కొనియాడారు. సోమవారం పట్టణంలోని మొల్ల సాహితీపీఠం కార్యాలయంలో హనుమంతరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ బద్వేలుకు సమీపంలోని గోపవరంలో జన్మించి తెలుగు రామాయణాన్ని రచించిన మొల్ల ఖ్యాతిని దేశవ్యాప్తం చేసిన హనుమంతరావు బద్వేలు నియోజకవర్గ వాసి కావడం గర్వకారణమని ప్రశంసించారు.

పి4పై ప్రజలు అభిప్రాయాలు చెప్పాలి

ఎంపీడీఓ రమణారెడ్డి

పోరుమామిళ్ల: ప్రభుత్వ, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టనున్న పి4 కార్యక్రమంపై ప్రజలు వారి అభిప్రాయాలు చెప్పాలని ఎంపీడీఓ రమణారెడ్డి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వెనుకబడిన కుటుంబాలను 20 శాతం మందిని సంపన్న కుటుంబాలు దత్తత తీసుకొని మార్గదర్శకత్వం చేసి వారు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు, ఉద్యోగ పరంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఒక సమన్వయ కర్తగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంపై ప్రజలు తమ అభిప్రాయాలు చెప్పాలన్నారు. దీనిపై ప్రభుత్వం క్యూఆర్ కోడ్ పెట్టిందని, దాన్ని స్కాన్ చేసి కూడా అభిప్రాయాలు చెప్పవచ్చన్నారు.

కోత మిషన్ల అవకతవకలపై విచారణ

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని అటవీశాఖ పరిధిలో ఉన్న పలు కోతమిషన్ల నిర్వహణలో జరిగిన అవకతవకలపై కడప స్క్వాడ్ డీఎఫ్ఓ శేఖర్‌బాబు సోమవారం విచారణ చేపట్టారు. ఇక్కడి కోతమిషన్లు కొన్ని నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని అధికారులకు ఫిర్యాదులు అందాయి. కొందరు లైసెన్సులు లేకుండా మిషన్లు నిర్వహిస్తున్నారని, కొందరి లైసెన్సుల గడువు కాలం పూర్తయినా రెన్యువల్ చేయించుకోలేదని ఫిర్యాదులు వెళ్లడంతో విచారణ చేసేందుకు ప్రొద్దుటూరుకు వచ్చారు. ముందుగా సబ్ డివిజన్ కార్యాలయంలోని మిషన్లకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించారు. లైసెన్స్ రెన్యువల్, జీపీఎస్ లోకేషన్‌ను ఏమైనా మార్చారా తదితర వివరాలను కోతమిషన్ల నిర్వాహకుల నుంచి తీసుకున్నారు. స్క్వాడ్ డీఎఫ్ఓ వెంట రేంజర్ నాయక్, ఎఫ్ఎస్ఓ కాశీరెడ్డి, డీఆర్ఓ లక్ష్మీకుమారి ఉన్నారు.

మాలల సింహగర్జన విజయవంతం చేయండి

గోపవరం : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 23వ తేదీన తిరుపతిలో నిర్వహించే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని మాల మహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాలరవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత రాజ్యాంగంలోని 341 ఆర్టికల్‌కు ఎస్సీ వర్గీకరణ అనుకూలంగా లేదని పేర్కొన్నారు. బద్వేలు నియోజకవర్గంలోని ఏడు మండలాల నుండి సింహగర్జనకు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు



ప్రొద్దుటూరు కల్చరల్ : హాల్‌టికెట్ల నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని స్థానిక జీఎఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గురుకుల పాఠశాలలో మొదటి రోజు సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జీఎఎస్ జెడ్పీ హైస్కూల్‌లో 240 మంది విద్యార్థులకు గాను ఇద్దరు గైర్హాజరు కాగా, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో 115 మంది విద్యార్థులకు గాను అందరూ పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ రవి శంకర్ తెలిపారు.

మైదుకూరు : సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షల్లో మైదుకూరులో పది మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, గురుకుల పాఠశాలలకు చెందిన 1238 మంది పదో తరగతి విద్యార్థులు 9 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలకు హాజరవ్వాల్సి ఉంది. సోమవారం జరిగిన తెలుగు పరీక్షకు 1228 మంది మాత్రమే హాజరయ్యారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రొద్దుటూరు పట్టణ, మండల పరిధిలో 23 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు తెలుగు, సంస్కృతం, ఉర్దూ సబ్జక్ట్‌లో పరీక్ష రాశారు. మొదటి రోజు కావడంతో విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాల వద్దకు గంట ముందే చేరుకుని తమ గదులను తెలుసుకున్నారు. ఉదయం 9 గంటలకు పరీక్ష గదిలోకి విద్యార్థులను అనుమతించారు. ప్రొద్దుటూరు మండలంలో 23 పరీక్షా కేంద్రాల్లో 3,770 మందికి గాను 3,758 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అట్లూరు : పదవ తరగతి పరీక్షలు మొదటి రోజు సోమవారం ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎంఈఓ విలియంరాజుపేర్కొన్నారు.మండలంలోని అట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కమలకూరు, సోమేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు కస్తూర్బా బాలికల విద్యాలయం విద్యార్థినులు మొత్తం 178 మందికి పరీక్షలు నిర్వహించారు.

కిటికీల అద్దాలు పగులకొట్టిన దుండగులు

కలసపాడు: మండల కేంద్రమైన కలసపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పరీక్షా కేంద్రం కిటికీ అద్దాలు పగలగొట్టాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మెర్సీ మాలిని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆమె తెలిపారు.

రబీ పంటలు కళకళ

రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఖరీఫ్‌లో వరి, మినుము, పెసర, మొక్కజొన్న తదితర పంటల నూర్పిళ్ల అనంతరం తిరిగి రెండో పంటగా వరి, కొర్ర, నువ్వు, వేరుశనగ, మొక్కజొన్న కుసుమ పంటలను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం ఆ పంటలు పచ్చగా కళకళలాడుతున్నాయి. గత మూడేళ్లుగా కుందూనదికి, కేసీ చాపాడు, ప్రధాన కాలువలకు మార్చి చివరి రోజు వరకు నీరు రావడంతో పొలాలన్నీ పచ్చగా ఉన్నాయి. దిగుబడులు కూడా ఆశాజనకంగా వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఆ దారిలో వెళ్లే వారికి చల్లని గాలులు వీయడంతో పాటు పంటలు బాగుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– రాజుపాళెం



పగిడాల వద్ద పచ్చగా ఉన్న మొక్కజొన్న పంట



టంగుటూరు వద్ద సాగు చేసిన నువ్వు పంట



రాజుపాళెంలో పచ్చగా కళకళలాడుతున్న కొర్ర పంట